సాక్షి
ఏలూరు
శుక్రవారం | 6 | సెప్టెంబర్ | 2024



హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కించారు. 86 రోజులకు రూ.45,87,330 ఆదాయం సమకూరింది.



పోషకాహార మాసోత్సవాలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 75వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పోషణ జీ పడాయి జీ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఎన్‌సీసీ సెలెక్షన్స్

పెంటపాడు: స్థానిక డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ సెలెక్షన్స్ నిర్వహించారు. 19 ఆంధ్రా బెటాలియన్ అధికారి కుల్వీందర్‌సింగ్ పాల్గొన్నారు.

- లంక గ్రామాల్లో పలు చోట్ల గండి
- 13 గ్రామాల్లోకి చేరిన వరద నీరు
- ఏలూరు-కైకలూరు రహదారిలో నిలిచిన రాకపోకలు
- మరోవైపు కొనసాగుతున్న గోదావరి వరద తీవ్రత
- పోలవరం నుంచి 9.67 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు
- వేలేరుపాడులో జలదిగ్బంధంలో 29 గ్రామాలు
- పునరావాస కేంద్రాల్లో 150 కుటుంబాలు

ఉధృతంగా కొల్లేరు



ఏలూరు-కైకలూరు మధ్యలో పెద ఎడ్లగాడి వద్ద రహదారిపై చేరిన కొల్లేరు వరద నీరు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వరద గోదావరితో ఏజెన్సీ ప్రాంతం.. బుడమేరు, తమ్మిలేరు వరద ఉధృతితో కొల్లేరు అతలాకుతలమవుతున్నాయి. కృష్ణా వరదలతో కొల్లేరు.. గోదావరి వరదలతో పోలవరం ముంపు మండలాల్లోని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. రెండింట్లో ప్రమాదకర స్థాయిలో నీటిప్రవాహం ఉండటంతో వరద తీవ్రత రోజురోజుకూ పెరుగుతుంది. ఫలితంగా వేలేరుపాడు మండలంలో 29 గ్రామాలు, కొల్లేరు పరిధిలో 13 గ్రామాల్లో వరదనీరు చేరి జనజీవనం స్తంభించింది.

పోలవరం స్పిల్‌వేలో 32.520 మీటర్లు

పోలవరం ప్రాజెక్టుకు బుధవారం 8.22 లక్షల క్యూసెక్కులు, గురువారం 9.67 లక్షల క్యూసెక్కుల నీరు చేరింది. భద్రాచలం వద్ద కూడా 45.50 అడుగుల నీటిమట్టంలో ప్రవాహం ఉంది. మరో రెండు రోజులు పాటు వరద తీవ్రత కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలో 32.520 మీటర్ల ఎత్తు నుంచి 48 గేట్ల ద్వారా 9,67,437 క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతుంది. ఇదే పరిస్థితి శుక్రవారం కూడా కొనసాగితే పశ్చిమ గోదావరి జిల్లాలోని లంక గ్రామాలకు వరద ముంపు పూర్తిగా పొంచి ఉన్నట్లే. గోదావరితో పాటు శబరి ఉధృతి కూడా పెరగడంతో వేలేరుపాడు మండలంలో 29 గ్రామాలు, కుక్కునూరు మండలంలో పలు గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. వరద నేపథ్యంలో గొమ్ముగూడేనికి చెందిన 150 కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు. వేలేరుపాడు-కోయిదా, వేలేరుపాడు-రుద్రమకోట రహదారులు పూర్తిగా నిలిచిపోయాయి.



కైకలూరు మండలం శృంగవరప్పాడు రోడ్డులో గండిని పరిశీలిస్తున్న దృశ్యం



వేలేరుపాడు మండలంలో వరద నీటిలో వెళుతున్న రేపాకగొమ్ము గ్రామస్తులు

ఓ వైపు బుడమేరు.. మరోవైపు తమ్మిలేరు

2006 తర్వాత మళ్లీ కొల్లేరు ఉగ్రరూపం దాల్చింది. 13 లంక గ్రామాల్లో నీరు చేరడం, శ్మశాన వాటికలు మునిగిపోవడం, ప్రధాన రోడ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విజయవాడ నుంచి బుడమేరు, ఏజెన్సీ నుంచి తమ్మిలేరు రెండు కూడా కొల్లేరు చేరుతుండటంతో కొల్లేరులో వరద తీవ్రత పెరిగింది. ఏలూరు-కొల్లేరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మండవల్లి మండలంలోని పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, శ్రీరామ్‌నగర్, ముచ్చుమిల్లి, పులపర్రు, కొవ్వాడలంక గ్రామ రహదారులు మునిగాయి. కైకలూరు మండలం పెంచుకలమర్రు, కొట్టాడ, శృంగవరపుపాడు ప్రమాద అంచున ఉన్నాయి. శృంగవరపుపాడు నుంచి పైడిచింతపాడు మీదుగా ఏలూరు చేరే రహదారిలో నాలుగు ప్రాంతాల్లో గండి పడింది. దీంతో ఆ రహదారిని మూసివేశారు. ఏలూరు రూరల్‌లోని ఏలూరు-గుడివాకలంక రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. గుడివాకలంక, కొక్కిరాయలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, పెదయాగనమిల్లి, కోమటిలంక, కలకుర్రు గ్రామాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి.

గోదావరికి రెండోసారి వరద



వేలేరుపాడు మండలంలో నిత్యావసర వస్తువులు తీసుకెళ్తున్న రుద్రమకోట గ్రామస్తులు

ఎగువ ప్రాంతాల నుంచి భారీగా చేరుతున్న వరద నీటితో ఏలూరు జిల్లా అతలాకుతలమవుతుంది. ప్రధానంగా గోదావరి వరద ఈ ఏడాది రెండవ పర్యాయం మొదలైంది. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు వరద గోదావరి ఉధృతితో పది రోజుల పాటు ఏజెన్సీ ప్రాంతం జలదిగ్బంధంలో చిక్కుకుంటుంది. అయితే ఈ ఏడాది గోదావరి వరదలు రెండుసార్లు వచ్చాయి. జూలై 19 నుంచి ఆగస్టు మొదటివారం వరకు వరద తీవ్రత కొనసాగింది. అందులోనూ గోదావరి పోటెత్తడంతో పాటు ఖమ్మం జిల్లాలోని పెదవాగుకు గండిపడటంతో వేలేరుపాడులో 40 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోవడంతో పాటు దాదాపు నెల రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయిన పరిస్థితి. మళ్లీ బుధవారం నుంచి గోదావరి వరద ప్రారంభమైంది.



పడవపై వేలేరుపాడు వస్తున్న రుద్రమకోట గ్రామస్తులు

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ నేతల విరాళం



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌కు చెక్ అందిస్తున్న నాయకులు

ముదినేపల్లి రూరల్: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విరాళాన్ని అందజేశారు. మండలంలోని దేవపూడికి చెందిన మాజీ సర్పంచ్ పెద్ది వీరయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు కట్టా మహేష్ రూ.50 వేల విరాళాన్ని చెక్కు రూపంలో తాడేపల్లిలోని కార్యాలయంలో గురువారం జగన్‌కు అందజేశారు. ప్రజలను ఆదుకునేందుకు జగన్ చేస్తున్న కృషికి చిరుసాయంగా పార్టీ తరఫున ఈ విరాళాన్ని అందజేసినట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విభాగాల్లో నియామకాలు



ముంగర సంజీవ్‌కుమార్



శెట్టి త్యాగరాజ

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ వడ్డీలు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కొల్లేరు ప్రాంతానికి చెందిన ముంగర సంజయ్‌కుమార్‌ను నియమించారు. ఆయన చాలా కాలంగా పార్టీలో పనిచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సూర్య బలిజ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా శెట్టి త్యాగరాజ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా సామాజిక వర్గాల అభ్యున్నతికి పాటుపడతామని వారు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

కుక్కునూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడిచేసిన ఘటన గురువారం సీతారామనగరంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారామనగరానికి చెందిన బిక్కసాని వెంకట్రావు, అతని కుమారుడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు. వెంకట్రావు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన వ్యక్తి తాండ్ర ఆజేష్ దాడి చేసి చంపేస్తానని బెదిరించాడు. అలాగే ఆజేష్ పక్కన ఉన్న మోపర్తి సురేష్ అసభ్య పదజాలంతో దూషించాడు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు వెంకట్రావు చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం



రమేష్ మృతదేహం

నూజివీడు: బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గొల్లపల్లికి చెందిన సీహెచ్ రమేష్ (32), బోనాల మహేష్ ద్విచక్ర వాహనంపై మీర్జాపురం వైపు నుంచి గొల్లపల్లి వెళుతున్నారు. మీర్జాపురం వెంకన్న చెరువు వద్ద ఉన్న వంతెన సమీపంలోకి వచ్చేసరికి అదే సమయంలో హనుమాన్ జంక్షన్ వైపు వెళుతున్న కారు టైర్ పేలి అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్ (చింటూ) ఘటనా స్థలంలోనే మృతి చెందగా, మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలిద్దరూ చిన్నవారు కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11న అథ్లెటిక్స్ సెలెక్షన్స్

ఏలూరు రూరల్: మంగళగిరిలో ఈనెల 14 నుంచి 16 వరకు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దేవరపల్లి ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఈనెల 11న ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఉదయం 8 గంటలకు బాలబాలికల జట్లు ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 10 నుంచి 23 ఏళ్ల వరకు పలు విభాగాల్లో జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గలవారు ఆధార్, పుట్టినతేదీ, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్‌తో హాజరై, వంద రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 6281431202, 76600 59833 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులపైనే గురుతర బాధ్యత

కలెక్టర్ వెట్రి సెల్వి



ఏలూరులో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులకు అక్షరజ్ఞానం అందించడంతో పాటు వారిని సామాజిక బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దే గురుతరమైన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ బోధన రంగాన్ని వృత్తిగా భావించకుండా సామాజిక బాధ్యతగా గుర్తెరగాలన్నారు. ప్రతి పాఠశాలలో తమ ప్రతిభ పాటవాలతో కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులకు చిరకాలం గుర్తుండిపోతారన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విలువైనదన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదన్నారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే వ్యక్తులను తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదన్నారు. జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, డీఈఓ ఎస్.అబ్రహం మాట్లాడారు. అనంతరం జిల్లాలో 20 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు, వివిధ అంశాల్లో ఉత్తమంగా నిలిచిన 11 పాఠశాలలకు అతిథులు పురస్కారాలను ప్రదానం చేశారు.

నందిగం సురేష్ అరెస్టు అప్రజాస్వామికం



అరెస్టును ఖండిస్తున్న ఎస్సీ నాయకులు

నూజివీడు: బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయగిరి కృపారావు, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ అరెస్టును వారు గురువారం నూజివీడులో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీకి చెందిన సామాన్యుడు ఎంపీగా పనిచేస్తే ఓర్చుకోలేని వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని దుయ్యబట్టారు. ఏ ఆధారం లేకుండా రెండు నెలలుగా నందిగం సురేష్‌ను వేధిస్తూ హైదరాబాద్‌లో ఈ రోజు తెల్లవారుజామున అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. అధికారం వచ్చిందని విర్రవీగితే ప్రజలు రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఏ ఆధారం ఉందని మాజీ ఎంపీ సురేష్‌పై కేసు నమోదు చేశారని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పుడూ ఎస్సీలకు వ్యతిరేకేనని ధ్వజమెత్తారు. తీరు మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో టీడీపీ ప్రభుత్వానికి దళితులే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, నాయకులు పిళ్లా చరణ్, చేబత్తిన మున్నా, కళ్లేపల్లి ఆదినారాయణ, తలారి సతీష్, కాలి సుగుణరావు, బుర్రి సుధాకర్, కలపాల రాంబాబు, గొర్రె శేఖర్, చింతల వెంకటరావు పాల్గొన్నారు.

అనుమానమే.. పెనుభూతమై

- భార్య ముఖంపై దిండుతో నొక్కి ఊపిరాడకుండా చేసి హత్య
- ఆపై పురుగుమందు తాగి భర్త ఆత్మహత్యాయత్నం



సత్యవతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఉండి: అనుమానమే పెనుభూతమై కట్టుకున్న భర్తే కాలయముడై ఆమెను కడతేర్చాడు. ఉండి మండలం కలిగొట్ల గ్రామంలో భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమె ముఖంపై దిండుతో ఊపిరాడనీయకుండా అదిమి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉండి గోరింతోట ప్రాంతానికి చెందిన గొల్ల చిరంజీవికి కలిగొట్ల గ్రామానికి చెందిన సత్యవతి (రేఖ) (36)తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. చిరంజీవి గతంలో మస్కట్‌లో పనిచేయగా, ప్రస్తుతం లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత ప్రభుత్వంలో మృతురాలు వలంటీర్‌గా పనిచేసింది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెతో అప్పుడప్పుడు గొడవపడుతూ ఉండేవాడు. ఇటీవల తరచూ గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మరోసారి వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి తిరిగి వచ్చి మళ్లీ గొడవకు దిగాడు. అక్కడితో ఆగకుండా అత్యంత పాశవికంగా ఆమె ముఖంపై దిండుతో గట్టిగా నొక్కి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం ఎలుకల మందు తాగి స్వగ్రామం ఉండి శివారు గోరింతోటకు వెళ్లిపోయాడు. అక్కడ బంధువులకు విషయం చెప్పడంతో వారి బంధువుల్లో ఒకరు మృతురాలి సోదరుడు ప్రసాద్‌కు ఫోన్ చేసి మీ బావ ఎలుకమందు తాగాడని, అతని బట్టలు తీసుకుని ఆసుపత్రికి రావాలని చెప్పాడు. అయితే అతను ఈ విషయాన్ని తల్లికి చేరవేడంతో ఆమె తన కుమార్తెకు చెప్పేందుకు ఇంటికి వెళ్లగా, అప్పటికే కుమార్తె మృతి చెంది ఉంది. దీంతో జరిగిన ఘోరాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. విషయాన్ని పోలీసులకు తెలియజేయడంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే ఘటనా స్థలికి చేరుకున్న క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎలుకల మందు తాగిన నిందితుడైన భర్త అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై మృతురాలి తల్లి భూపతి సత్యవతి ఫిర్యాదు మేరకు ఎస్సై నసీరుల్లా కేసు నమోదు చేయగా, ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాపరిషత్ క్యాంపు కార్యాలయంలో జెడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజనీరింగ్ అధికారులతో గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాల కారణంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శులను భాగస్వామ్యం చేసుకుని తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు. జెడ్పీ సీఈఓ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, భీమవరం, ఏలూరు, రాజమండ్రి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు పాల్గొన్నారు.

బాలుడి దుర్మరణం

భీమవరం: పట్టణంలోని 6వ వార్డులో బొక్కావారి పాలెం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. బొక్కా శ్రీనివాసరావు కుమారుడు లక్ష్మీ శ్రీగణేష్ (13) తాగునీరు కోసం వెళ్లి తిరిగి వస్తుండగా వ్యాన్ ఢీకొట్టింది. దీంతో బాలుడు మృతిచెందినట్టు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

గూడెంలో ఒంటరి మహిళ హత్య



బొబ్బిలి దేవి (ఫైల్)

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం పట్టణంలోని నాలుగో వార్డులో ఓ ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మహిళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బేతివారివీధిలో బొబ్బిలి దేవి (50) నివాసం ఉంటోంది. పదేళ్ల క్రితం భర్త నాగేశ్వరరావు మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు. దేవి కూరగాయలు దుకాణం, పాన్‌షాపు నిర్వహిస్తుంది. ఆమెతోపాటు ఇంటిలో పెద్దకుమార్తె ఒమ్మి రాజ్యలక్ష్మి, అల్లుడు నివాసం ఉండేవారు. నెల క్రితం వీరిద్దరూ ఉద్యోగం నిమిత్తం దుబాయి వెళ్లారు. అప్పటి నుంచి దేవి ఒంటరిగా ఉంటోంది. పెద్దకుమార్తెకు ఆటో ఉండగా, దీనిని పట్టణానికి చెందిన కరిమి సాయికి అద్దెకు ఇచ్చారు. రోజూ రాత్రి అద్దె చెల్లించి ఆటోను దేవి ఇంటి వద్ద ఉంచి ఉదయాన్నే వచ్చి ఆటోను తీసుకువెళతాడు. బుధవారం రాత్రి యధావిధిగా ఆ టోను దేవికి అప్పగించి వెళ్లాడు. గురువారం ఉదయం సాయి ఆటో తీసుకువెళ్లేందుకు రాగా, దేవి ఇంటి తలుపులు మూసిఉన్నాయి. ఎంత పిలిచినా తలుపులు తీయకపోవడంతో దీంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులను బలవంతంగా తెరిచి లోనికి వెళ్లి చూడగా దేవి తలకు గాయమై రక్తంతో కింద పడి కనిపించింది. సీఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించగా, దేవి తలకు, మెడకు గాయాలు ఉండటాన్ని, మెడలో గొలుసు, చేతికి ఉంగరాలు లేకపోవడాన్ని గుర్తించారు. డీఎస్పీ మూర్తికి సమాచారం ఇచ్చి డాగ్‌స్క్వాడ్‌ను రప్పించారు. జాగిలం దేవి ఇంటి నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు వచ్చి ఆగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ సొమ్ము మాయంపై కేసు నమోదు

ఆగిరిపల్లి: నెక్కలం గొల్లగూడెం సచివాలయంలో మహిళా పోలీస్ వద్ద నుంచి పింఛన్ సొమ్ము మాయంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేంద్ర కుమార్ చెప్పారు. గురువారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెక్కలం గొల్లగూడెంలో లలిత కుమారి మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈనెల 31న పంచాయతీ కార్యదర్శి వద్ద రూ.2 లక్షల 44 వేలు తీసుకుని అందులో కొంత మొత్తం పింఛన్‌దారులకు అందజేశారు. సచివాలయం సమీపంలోని కొందరు లబ్ధిదారులకు పింఛన్ అందజేసి మిగిలిన రూ.1.22 లక్షలు తన బ్యాగులో పెట్టకుండా పొరపాటున సచివాలయంలోనే మరిచిపోయి విజయవాడలోని తన ఇంటికి వెళ్లింది. సోమవారం పింఛన్ డబ్బులు కనిపించకపోవడంతో సచివాలయానికి వచ్చి వెతికింది. అయినా ఫలితం లేకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా, మిగిలిన లబ్ధిదారులు పింఛను కోసం ఎదురుచూస్తుండటంతో బయట నుంచి అప్పు తీసుకువచ్చి గురువారం లబ్ధిదారులకు పింఛను అందజేసినట్టు తెలిసింది.